క్లుప్తంగా

కేజీబీవీలో 9,10 తరగతి ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ


ఎంఈవో జానుప్రసాద్

రోలుగుంట: జేనాయుడుపాలెం గ్రామంలో గల కేజీబీవీ 4 టైపు ఉన్నత పాఠశాలలో 9,10 తరగతుల్లో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు మండల విద్యాశాఖాధికారి జానుప్రసాద్ తెలిపారు. స్థానికులై ఉండి, మధ్యలో బడిమానివేసిన బడిఈడు పిల్లలు, అనాథలు, ఒక్కరే పేరెంట్ (తల్లి,లేక తండ్రి)గల తెల్లరేషన్ కార్డు కలిగిన వారు అర్హులని తెలిపారు. ఆన్‌లైన్‌లో లేదా, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9912560441 లేదా, 9866808744 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఘనంగా గ్రామదేవతల ఒడ్డు పండగలు


ఎం. కోడూరులో గోసమ్మకు ఒడ్డు పండగ నిర్వహిస్తున్న భక్తులు


మాడుగుల రూరల్: ఎం.కోడూరు మోదమాంబకు గ్రామస్తులు ఒడ్డు పండగ నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు, సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు పర్యవేక్షణలో పండగ నిర్వహించారు. అప్పాన శంకర్ కుటుంబ సభ్యులు గోసమాంబకు ఒడ్డు పండగ నిర్వహించారు. 101 ఘటాలతో పండగ నిర్వహించారు. భక్తులకు సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు పడాల అప్పలనాయుడు పాల్గొన్నారు. కె.జె.పురం, సాగరం, ఘాట్‌రోడ్డు, తదితర గ్రామాల్లోనూ అమ్మవార్లకు ఒడ్డు పండగలు నిర్వహించారు.

ఎ.కోడూరులో ఘనంగా మోదకొండమ్మ పండగ


ఎ.కోడూరులో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

కె.కోటపాడు : ఎ.కోడూరులో మంగళవారం మోదకొండమ్మ అమ్మవారి పండగ ఘనంగా జరిపారు. ఉదయం నుండే అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. ఈ సందర్భంగా ఆలయాన్ని పుష్పాలంకరణతో ఆలయ కమిటీ సభ్యులు సుందరంగా తీర్చిదిద్దారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన జరిపారు. పండగ సందర్భంగా గ్రామంలో బంధుమిత్రుల రాకతో సందడి నెలకొంది. విద్యుదలంకరణ ఆకట్టుకుంది. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

శ్రమదానంతో గోతుల పూడ్చివేత


దొండపూడిలో శ్రమదానం చేస్తున్న యువకులు

రావికమతం : వైఎస్సార్‌సీపీ యువ నాయకులు దొండపూడి గ్రామంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు గోతులను మంగళవారం పూడ్చించారు. దొండపూడిలో ఆర్‌అండ్‌బీ రోడ్డు పూర్తిగా శిథిలమైంది. కురుస్తున్న వర్షాలకు రోడ్డుపై నీరు చేరి వాహనదారులకు గోతులు కనబడక తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గ్రామానికి చెందిన యూత్ నాయకుడు పెచ్చెట్టి మణిరాజు ఆధ్వర్యంలో యువకులు పలు చోట్ల గోతులను పూడ్చారు. వారిని గ్రామస్తులు అభినందించారు.

సత్యసాయి ప్రేమవాహిని రథయాత్ర


కె.కోటపాడులో ప్రేమవాహిని రథయాత్రలో పాల్గొన్న భక్తులు

కె.కోటపాడు : భగవాన్ సత్యసాయి శత జయంతి ఉత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న ప్రేమవాహిని రథయాత్ర సోమవారం రాత్రి కె.కోటపాడు మండలంలో ప్రవేశించింది. మండలంలో వారాడ గ్రామం నుంచి ఈ రథయాత్ర ఎ.కోడూరు, కె.కోటపాడు మీదుగా కింతాడ రామసత్య సాయి మందిరం వద్దకు చేరుకుంది. పెద్ద సంఖ్యలో సత్యసాయిబాబా భక్తులు రథయాత్రలో పాల్గొన్నారు. జిల్లా సత్యసాయి సేవా సమితి అధ్యక్షుడు కిశిరెడ్డి అప్పలనాయుడు, కె.కోటపాడు సేవా సమితి అధ్యక్షుడు నారాయణపాత్రుడు పాల్గొన్నారు.



ఎప్పుడు చూసినా మూసేసి ఉంటున్న నాతవరం ఎంపీడీవో కార్యాలయంలో గది

అటెండరు సైతం లేక తెరుచుకోని నాతవరం పశువైద్యశాల

అటెండరుతో నడుస్తున్న నాతవరం గ్రంథాలయం

అధికారుల కొరత తీరేనా అధ్యక్షా..!

పలు శాఖల్లో నెలల తరబడి ఇన్‌చార్జిలే దిక్కు

పెండింగ్‌లో పలు సమస్యలు

స్పీకర్ దృష్టి సారించాలని కోరుతున్న మండలవాసులు

నాతవరం : స్పీకరు అయ్యన్నపాత్రుడు ఇలకాలో నెలల తరబడి వెంటాడుతున్న అధికారులు ఖాళీల కొరత సమస్య ప్రభుత్వం చేపట్టిన బదిలీలతో తీరుతుందని మండల వాసులు ఆశిస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రస్తుతం మండలంలో ఏశాఖలో చూసినా అధికారుల కొరత దర్శనమిస్తోంది. వివిధ శాఖలకు సంబంధించి పూర్తి స్థాయిలో అధికారులు లేకపోవడంతో ప్రజలు ఏపని చేయించుకోవాలన్నా అవస్థలు పడుతున్నారు. మండలానికి కీలకంగా ఉండే ఎంపీడీవో పోస్టు 8 నెలలుగా ఖాళీగా ఉంది, నర్సీపట్నం ఎంపీడీవో కె.ఉషాశ్రీకి అదనపు బాధ్యతలు అప్పగించి కాలం వెళ్లదీస్తున్నారు. ఆమె ఎంపీడీవో కార్యాలయానికి ఎప్పుడు వస్తారో తెలియని పరిస్థితి ఉంది. ఎప్పుడు చూసినా కార్యాలయం గదికి తాళాలు వేసి ఉంటుంది. ఆఫీసుకు సంబంధించి అత్యవసర ఫైల్స్ ఉంటే సిబ్బందితో నర్సీపట్నం రప్పించుకుని సంతకాలు చేస్తుంటారు.

సచివాలయాల్లో సిబ్బంది కొరత

ప్రజలకు గ్రామంలోనే అన్ని రకాల సేవలందించాలన్న మంచి ఉద్దేశ్యంతో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన సచివాలయాల్లో సిబ్బంది కొరత వెంటాడుతుంది. మండల వ్యాప్తంగా ఉన్న 17 సచివాలయాల్లో 187మంది సిబ్బంది ఉండాల్సిండగా ప్రస్తుతం 86 మంది మాత్రమే పని చేస్తున్నారు. 101 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.


ఉపాధి కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ లేక మేట్‌లతో సేవలు

పశువైద్యులు లేరు...

మండలంలో గునుపూడి, నాతవరం, శృంగవరంలో మూడు పశు వైద్యాశాలలు ఉన్నాయి, వాటిలో గునుపూడి పశువైద్యశాలలోనే వైద్యులు ఉండగా మిగతా రెండు వైద్యశాలలో వైద్యులు లేరు. వైద్యులతో పాటు ఇతర క్షేత్ర స్థాయి సిబ్బంది, ఒక్క అటెండరు సైతం కూటమి ప్రభుత్వం ఏర్పడిన దగ్గర్నుంచి లేరు. అటెండర్లు లేక నాతవరంలో పశువైద్యశాల ఎప్పుడు చూసినా మూసేసి ఉంటుంది. పశువులకు ఎలాంటి రోగం వచ్చినా గోపాలమిత్రులపై ఆధారపడాల్సి వస్తుందని పాడి రైతులు చెబుతున్నారు.

అదనపు బాధ్యతలతో పనిభారం..

తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ, సీనియర్ అసిస్టెంటు, టైపిస్టు, 8 మంది వీఆర్వోలు, ఏడుగురు వీఆర్ఏలు, డ్రైవర్, ఇద్దరు ఆఫీసు సబార్డినేట్, సర్వే చైన్‌మన్, వాచ్‌మన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీఆర్వోలు లేని చోట ఇతర చోట్ల పనిచేసే వారికి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఉపాధి కార్యాలయంలో టీసీ, టీఏలు, కంప్యూటర్ ఆపరేటర్లు, వీఆర్పీల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కంప్యూటర్ ఆపరేటర్ ఒకరే ఉండడంతో పని భారం వల్ల కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న మేట్‌లతో పని చేయిస్తున్నారు.

వ్యవసాయ శాఖలో ఐదు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మండలంలో ఏకైక గ్రంథాలయంలో పని చేసే అధికారి గత ఏడాది జూన్‌లో పదవీ విరమణ చేయడంతో అప్పటి నుంచి ఎవరినీ నియమించలేదు. ప్రస్తుతం గ్రంథాలయం అటెండరుతో నడిపిస్తున్నారు. గునుపూడి, నాతవరం పీహెచ్‌సీల్లో, విద్యుత్ శాఖలోనూ సిబ్బంది కొరత ఉంది. గతంలో పని చేసిన కొంత మంది అధికారులు బదిలీపై వెళ్లిపోగా, ఆయా స్థానాల్లో ఇతర ప్రాంతాల నుంచి అధికారులు రావడానికి వెనుకంజ వేస్తున్నారు. స్పీకరు అయ్యన్నపాత్రుడు ప్రత్యేక దృష్టి సారిస్తే ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో ఆయా ఖాళీల భర్తీ చేయవచ్చని పలువురు కోరుతున్నారు. పూర్తి స్థాయి అధికారులు లేక అభివృద్ధి కుంటుపడడంతో పాటు సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందడంలో జాప్యం జరుగుతుందంటున్నారు.

పూర్తి స్థాయి అధికారులు లేక ఇబ్బంది



రెగ్యులర్ ఎంపీడీవో లేక చాలా ఇబ్బందులు పడుతున్నాం. ప్రతి రోజు వివిధ పనుల కోసం సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఇతర ప్రజాప్రతినిధులు అధికారుల కోసం అడుగుతున్నా ఏమీ చేయలేని పరిస్థితి ఉంది. కూటమి ప్రభుత్వ పెద్దలు ఖాళీలు భర్తీ చేయాలి. ఈ సమస్యపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాను.

– సాగిన లక్ష్మణమూర్తి, ఎంపీపీ, నాతవరం

కనీసం ఆఫీసు తీసేవారు లేరు



సచివాలయంలో ఒక్కరే ఉన్నారు. మండల కేంద్రానికి వెళ్లినా, ఫీల్డ్‌కు వెళ్లినా ఆఫీసు మూసేసి ఉంటుంది. ఖరీఫ్ సీజన్‌లో రైతుల కోసం ఆఫీసు తెరిచి ఉంటే చాలు. సిబ్బంది కొరతపై అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. గ్రామంలో మా సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదు.

– వేముల సూర్యనారాయణ, సర్పంచ్, గునుపూడి

29న మహలక్ష్మి, ఎరుకమ్మతల్లి ఆలయాల్లో ప్రత్యేక పూజలు

మాడుగుల రూరల్: కె.జె.పురం కాళ్లవారి నూతు వద్ద నూతనంగా నిర్మించిన మహాలక్ష్మమ్మతల్లి, ఎరుకమ్మతల్లి ఆలయాల వద్ద ఈ నెల 29న గురువారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ వారు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయం త్రైవార్షికోత్సవం సందర్భంగా అదే రోజు మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు.

రైతుల శ్రేయస్సుకు కృషి


వరహాలురాజు తదితరులను సన్మానిస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్: రైతుల శ్రేయస్సుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని రాష్ట్ర బీజేపీ కిసాన్‌మోర్చా అధ్యక్షుడు కుమారస్వామి పేర్కొన్నారు. అనకాపల్లిలో మంగళవారం జరిగిన బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. ముకుందపురం గ్రామానికి చెందిన బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి కర్రి వరహాలురాజు, గ్రామానికి చెందిన పలువురు రైతులను ఆయన సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు డి.పరమేశ్వరరావు, జిల్లా కిసాన్‌మోర్చాఅధ్యక్షుడు రాజు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో కుండపోత వర్షం

గొలుగొండ: మండలంలో జోగుంపేట, అమ్మపేట, చిన్నయ్యపాలెం, కొత్తమల్లంపేట, సాలికమల్లవరం, వెంకటారపురం తదితర గ్రామాల్లో మంగళవారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. గంటపాట కురిసిన వర్షం కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కారణంగా రోడ్లు నీటితో నిండిపోయాయి.

మాడుగుల రూరల్: ఉదయం నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉంది. మంగళవారం మధ్యాహ్నం మబ్బులు పట్టి భారీ వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. కొన్ని చోట్ల గాలుల వల్ల చెట్లు నేలకొరిగాయి.

చినుకుపడితే జలమయం


నర్సీపట్నం-తుని రోడ్డు బలిఘట్టం వద్ద మెయిన్ రోడ్డుపై చేరిన వర్షం నీరు


చెరువును తలపిస్తున్న శారదానగర్ సత్యసాయి మందిరానికి వెళ్లే రోడ్డు

నర్సీపట్నం: చినుకుపడితే నర్సీపట్నం మున్సిపాలిటీ జలమయమవుతుది. వారం రోజుల నుండి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలతో పట్టణంలోని పల్లపు ప్రాంతాలు జలమయం అవుతున్నాయి. ముఖ్యంగా శారదానగర్ రోడ్లు నీటితో నిండి ఉంటున్నాయి. ఈ ప్రాంతంలో మురుగునీటి పారుదల వ్యవస్థ లేదు. దీంతో రోడ్లపైనే చెత్తాచెదారం, బురద పేరుకుంటున్నాయి. వీటి మధ్య రాకపోకలు సాగించడం ప్రజలకు నరకప్రాయంగా ఉంది. సత్యసాయి బాబా మందిరంకు వెళ్లే ప్రధాన రోడ్డులో మురుగునీరు బయటకు పోయే మార్గం లేదు. ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ వద్ద మెయిన్‌రోడ్డు కల్వర్టు కుచించుకుపోవడంతో పై నుంచి వచ్చే వర్షం నీరు రోడ్డుపై ఎరులై పారుతుంది. తుని-నర్సీపట్నం రోడ్డు మీద బలిఘట్టం వద్ద మోకాళ్ల లోతు నీళ్లు నిలిచిపోయాయి. ద్విచక్రవాహనదారులు అగచాట్లు పడుతున్నారు.

రోలుగుంట: మండలంలో వర్షాలకు గ్రామాల్లో డ్రైనేజీలు పూడికపోయి వర్షపు నీరు రోడ్లపై పారుతోంది. రోలుగుంట, కొవ్వూరు, తదితర గ్రామాల్లో లోతట్టు ప్రాంతాల నుంచి నీరు పోయే మార్గం లేక రోడ్డును ముంచెత్తుతోంది. ఇళ్ల ముందే రోజుల తరబడి నీరు నిల్వ ఉండడంతో దుర్వాసనకు తోడు దోమలు ప్రబలుతున్నాయి. పంచాయతీ పాలకులు, అధికారులు స్పందించి లోతట్టు ప్రాంతాలను సందర్శించి, డ్రైనేజీల్లో పూడికలు తీయించి సమస్య పరిష్కరించాలని జనం కోరుతున్నారు.

సచివాలయాల్లో ఆధార్ శిబిరాలు

మాడుగుల రూరల్: గ్రామ సచివాలయాల్లో ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నారు. చిన్నారులకు ఆధార్ నమోదుతో పాటు ఆధార్‌లో వయస్సు, చిరునామా, పేరు మార్పు, తదితర తప్పు ఒప్పుల సవరణ చేస్తున్నారు. కె.జె.పురం గ్రామ సచివాలయంలో మంగళవారం జరిగిన శిబిరంలో గ్రామస్తులతో పాటు చుట్టు ప్రక్కల గ్రామాలకు చెందిన వారు ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకున్నారు.

ఎయిడ్స్‌పై కళాజాతా ప్రదర్శన


కొత్తకోటలో వీధి నాటకం ప్రదర్శిస్తున్న కళాకారులు

రావికమతం : కొత్తకోటలో మంగళవారం కళాజాతా బృందం ఎయిడ్స్‌పై ప్రదర్శన ఇచ్చారు. కళాజాతా బృందం జిల్లా అధ్యక్షుడు కోటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారుల ఆదేశాల మేరకు కళాజాత బృందాలతో ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వీధి నాటకం ప్రదర్శనలు చేస్తున్నట్టు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఈ నెల 9 నుంచి 30 తేదీ వరకూ ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

జీవో నెంబర్ 4తో వీఆర్వోలపై పని ఒత్తిడి


కె.కోటపాడులో తహసీల్దార్ రమేష్‌బాబుకు వినతిపత్రం అందిస్తున్న వీఆర్వోలు

కె.కోటపాడు : రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 17న విడుదల చేసిన జీవో నెంబర్ 4 కారణంగా వీఆర్వోలపై తీవ్ర పని భారం, ఒత్తిడి పడనున్నట్టు జిల్లా వీఆర్వోల సంఘం ఉపాధ్యక్షుడు పూడి సురేష్, మండల వీఆర్వోల సంఘం అధ్యక్షుడు అనంత్ అన్నారు. రాష్ట్ర వీఆర్వోల సంఘం పిలుపు మేరకు మంగళవారం తహసీల్దార్ డి.రమేష్‌బాబుకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో నెంబర్ 4 కారణంగా రెండు సచివాలయాలకు ఒక వీఆర్వో ఉండాల్సి వస్తుందన్నారు. ఈ కారణంగా రాష్ట్రంలో పని చేస్తున్న 7502 మంది వీఆర్వోల భవిష్యత్ ప్రశ్నార్థకం అవుతుందన్నారు. ఇప్పటికే రీసర్వే, పీజీఆర్ఎస్, రెవెన్యూ సదస్సులతో పాటు రోజువారి రెవెన్యూ విధులను నిర్వహిస్తున్న వీఆర్వోలకు రెండు సచివాలయాలకు ఒకరు విధులను నిర్వహించడం వల్ల పని భారం, ఒత్తిడి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం జీవోను సవరించి వీఆర్వోలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని వీరు కోరారు. కార్యక్రమంలో వీఆర్వోల సంఘం మండల కార్యదర్శి శివ, జిల్లా కోశాధికారి గౌరీశంకర్, పూడి శేషగిరి, జ్యోతి, విజయశ్రీ, సూర్యనారాయణ పాల్గొన్నారు.

లోవోల్టేజ్ సమస్య పరిష్కారానికి చర్యలు


ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అప్పారావు

నర్సీపట్నం : మున్సిపాలిటీలోని లోవోల్టేజ్ సమస్యను అధిగమించేందుకు కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నామని, మున్సిపాలిటీతో పాటు డివిజన్ పరిధిలోని లోవోల్టేజ్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అప్పారావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డివిజన్‌లో దీర్ఘకాలికంగా ఉన్న విద్యుత్ సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. ప్రధాన సమస్యలను గుర్తించి నిధులు మంజూరు కొరకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. విద్యుత్ సమస్యలు ఏమైనా ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకువచ్చినట్టయితే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీపై అందిస్తున్న సూర్యఘర్ పథకాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఘనంగా సన్యాసమ్మ అమ్మవారి ఒడ్డు పండగ



దేవరాపల్లి : స్థానికచిన్నంనాయుడు నగర్‌లో సన్యాసమ్మ అమ్మవారి ఒడ్డు పండగ మహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. ఆలయ ధర్మకర్త వరదపురెడ్డి చంద్రరావు, గౌరీ దంపతుల ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. తెల్లవారుజాము నుంచి గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. మహిళల కోలాట ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

యోగాంధ్ర కార్యక్రమం విజయవంతం చేయాలి



యోగాంధ్ర కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో ఉషాశ్రీ


దేవరాపల్లిలో యోగా శిక్షణను పరిశీలిస్తున్న ఎంపీడీవో సువర్ణరాజు


రోలుగుంటలో యోగా శిక్షణలో పాల్గొన్న ఎంపీడీవో నాగేశ్వరరావు, ఎంఈవో జగ్గారావు

నాతవరం: ప్రభుత్వం తలపెట్టిన యోగాంధ్ర కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో విజయవంతం చేయాలని ఎంపీడీవో ఉషాశ్రీ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం యోగాంధ్ర కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. యోగా వల్ల ఉపయోగాలు తెలియజేయాలన్నారు.

మాడుగుల: యోగాతోనే సంపూర్ణారోగ్యం సాధ్యమవుతుందని, యోగా నిపుణులు చెబుతున్నారని, చిన్నా పెద్దా అందరూ యోగాపై దృష్టి సారించాలని, ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరంలో అధికారులు, సచివాలయ సిబ్బందితో నిర్వహించిన యోగా శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీవో అప్పారావు, ఎస్ఐ నారాయణరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చీడికాడ: యోగ వలన ఆరోగ్యం,మానసిక ఉల్లాసం వస్తుందని ఎంపీడీవో హేమసుందరరావు తెలిపారు.మంగళవారం చీడికాడ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో యోగా తరగతులను ప్రారంభించారు. శిక్షణలో పాల్గొన్న వారితో కలిసి యోగాసనాలు వేసారు. నాలుగు రోజుల పాటు గ్రామాల్లో యోగా శిక్షణ అందిస్తారన్నారు.


చీడికాడ హైస్కూల్ గ్రౌండ్‌లో యోగా శిక్షణ


యోగా శిక్షణలో పాల్గొన్న ఎంపీపీ రాజారామ్ తదితరులు

కె.కోటపాడు : గ్రామస్థాయిలో యోగాపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన, శిక్షణను అందించేందుకు మాస్టర్ ట్రినర్‌ల ద్వారా యోగాపై శిక్షణను నాలుగు రోజుల పాటు ఇప్పిస్తున్నట్టు ఎంపీడీవో సాంబశివరావు అన్నారు. కె.కోటపాడు హైస్కూల్‌లో మంగళవారం నిర్వహిస్తున్న యోగా శిక్షణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ నెల 27 నుండి 30 వరకూ కె.కోటపాడు, పాతవలస, దాలివలస, చౌడువాడ, కొరువాడ గ్రామాల్లో యోగా శిక్షణ ఉంటుందన్నారు.

దేవరాపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మంగళవారం యోగా ట్రినర్లకు శిక్షణ ఇచ్చారు. మండలంలోని 200 మందిని ఎంపిక చేసి ఐదు రోజుల పాటు మాస్టర్ యోగా ట్రినర్లతో శిక్షణ నిర్వహిస్తామని ఎంపీడీవో సువర్ణరాజు తెలిపారు. శిక్షణకు హాజరైన ఉద్యోగులకు యోగా గురువు నగేష్ పర్యవేక్షణలో మాస్టర్ యోగా ట్రినీలు బాబూరావు, సూర్యప్రకాష్, రాధిక సూక్ష్మ వ్యాయామాలు, ఆసనాలు, ప్రాణాయామం, ధ్యానంలో సాధన చేయించారు. శిక్షణ పూర్తి చేసిన వారు గ్రామ స్థాయిలో సచివాలయ పరిధిలో 50 మందికి చొప్పున ట్రైనింగ్ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఆయుర్వేద వైద్యాధికారి గ్రీష్మ, మండల పరిషత్ పరిపాలన అధికారి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రోలుగుంట : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో యోగా శిక్షణ తరగతులను ఎంపీడీవో నాగేశ్వర్రావు మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మండల ప్రత్యేకాధికారి మనోహర్ ప్రారంభించారు. వివిధ శాఖల నుంచి పాల్గొన్న ఉద్యోగులకు మాస్టర్ ట్రైనర్లు ఆరోగ్య సూత్రాలపై శిక్షణ ఇచ్చారు. తహసీల్దార్ నాగమ్మ, ఎంఈవో జగ్గారావు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో ఈశ్వరరావు పాల్గొన్నారు.